క్లుప్తంగా

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అధికారులు

మనుబోలు: మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం గ్రామంలో రూ.39.20 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్ స్థానిక నాయకులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనలతో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

నేలటూరులో అగ్నిప్రమాదం



మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని నేలటూరు గ్రామంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. పుల్లయ్య అనే వ్యక్తికి చెందిన వంట గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పక్కనున్న టీ దుకాణం, చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు.

వడ్డిపాళెంలో పోలీస్ పికెట్



ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ కట్టకింద వడ్డిపాళెంలో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. బుధవారం వడ్డిపాళెంలో ఓ వర్గం వారు మరో వర్గం వారి ఇళ్లపై దాడులు చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గురువారం పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు.

సాయినాథునికి విశేష పూజలు



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో సాయిబాబా

మనుబోలు: మండలంలోని మనుబోలులో ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

⇨ **పొదలకూరు:** పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ జరిగింది.

తాగేందుకు నీరు లేదు

• ఎమ్మెల్యేకు సమస్యల ఏకరవు



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న మహిళలు

కోవూరు: కోవూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు పలు సమస్యలను ఏకరవు పెట్టారు. ఇందులో ప్రధానంగా మా కాలనీలో తాగేందుకు గుక్కెడు నీరు లేదని.. దీనిపై అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు తెలిపారు. ఇక్కడ తాగేందుకు బురద నీరే దిక్కయిందని వాపోయారు. అలాగే డ్రైయిన్లు, రోడ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నాలుగు నెలలుగా చెత్త తీయడం లేదని, దీనివల్ల దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. దీంతో అధికారులను పిలిచి రెండు రోజుల్లో ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

రైతులకు యూరియా కష్టాలు

• కొందరికే అందుతున్న వైనం
• సబ్ డివిజన్లో 12 వేల ఎకరాల్లో వరిసాగు
• మార్కెట్లో అధిక ధరకు యూరియా విక్రయాలు
• దిగుమతి అవుతుందంటున్న అధికారులు



యూరియా చల్లుతున్న రైతు

పొదలకూరు: యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎడగారులో సాగునీటి లభ్యత ఉన్నందున వరి సాగు విస్తీర్ణం అనుకోని విధంగా పెరగడంతో ఈ సమస్య వచ్చిందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ఇప్పటికీ యూరియా సక్రమంగా లభ్యం కాక రైతులు అధిక ధరలను చెల్లించి మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి యూరియాను తెప్పించి రైతులకు అందజేస్తున్నామని, ఎమ్మార్పీకి అమ్ముకుంటే తమకు నష్టం వస్తుందని వ్యాపారులు అంటున్నారు.

తగిన విధంగా..

సాగు విస్తీర్ణం పెరిగిన సమయంలో అధికారులు అందుకు తగిన విధంగా యూరియా కోసం ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. అయితే నాలుగేళ్ల ఎడగారు సాగు చరిత్ర పరిశీలించి ప్రతి జిల్లాకు యూరియాను సరఫరా చేస్తారని అందులో భాగంగానే గతేడాది జిల్లాలో 78 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు నాట్లు పడ్డాయనేది అధికారుల మాట. ఈ ఖరీఫ్‌లో అనూహ్యంగా 3 లక్షల ఎకరాల్లో నాట్లు పడటంతో యూరియా కష్టాలు తప్పలేదని చెప్పుకొస్తున్నారు. అయితే ఐఏబీ సమావేశంలో వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొని తీర్మానాలు చేస్తుంటారు. ఫలితంగా జిల్లాలో రెండో పంట కింద 3.20 లక్షల ఎకరాలకు సాగునీటిని అందజేస్తామని తీర్మానించారు. దీనికి తగిన విధంగా వ్యవసాయ శాఖ యూరియా ఇండెంట్ పెట్టాల్సి ఉంటుందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

సబ్ డివిజన్ పరిధిలో..

పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 12 వేల ఎకరాల్లో ఎడగారు వరినాట్లు పడ్డాయి. మరో వెయ్యి ఎకరాల్లో ఇంకా నాట్లు పడే అవకాశం ఉందంటున్నారు. పొదలకూరులో 3,700 ఎకరాలు, చేజర్లలో 4,800 ఎకరాలు, రాపూరులో 370 ఎకరాలు, కలువాయిలో 2,500 ఎకరాలు, మనుబోలులో 350 ఎకరాల్లో ఇప్పటి వరకు వరినాట్లు పడ్డాయి. ఈ మండలాల రైతులకు మరో 500 టన్నుల వరకు యూరియా అవసరమవుతుంది. ఇప్పటి వరకు వీరు మూడు కోటాల యూరియాను తీసుకుని పైరుకు చల్లినట్టు వ్యవసాయాధికారులు వెల్లడించారు. సొసైటీల నుంచి నామమాత్రంగానే రైతులకు అందుతోంది. పొదలకూరు సొసైటీ నుంచి ఇప్పటి వరకు కేవలం 40 టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయ్యింది. రెండురోజుల్లో లోడు వస్తుందని సీఈఓ చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా యూరియాను అందజేస్తున్నామని చెబుతున్నా తమకు దక్కడం లేదని అధికార పార్టీ నాయకులు తీసుకెళ్తున్నట్టు చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లో అధిక ధరలు

యూరియా డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఎరువుల వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు మూడు కోటాలకు సరిపడా యూరియాను ఇళ్లలో పెట్టుకోవడంతోనే డిమాండ్ బాగా పెరిగిందనే వాదన కూడా ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో యూరియా బస్తా రూ.400 వరకు అమ్ముతున్నారు. ఎమ్మార్పీ మాత్రం రూ.267 రైతులకు అందజేయాల్సి ఉంటుంది. రవాణా తదితర ఖర్చుల కింద మరో రూ.10 అదనంగా తీసుకున్నారు. అయితే రూ.380 నుంచి రూ.400కు విక్రయిస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక ధరలను చెల్లించినా సమయానికి యూరియా అందడం లేదని వాపోతున్నారు.

ఎలాంటి ఇబ్బందుల్లేవు



చాలామంది రైతులు ఇప్పటికే మూడు కోటాల వంతున ఎడగారు సాగు వరికి యూరియాను చల్లారు. మరో కోటా మాత్రమే పైరుకు చల్లాల్సి ఉంది. రెండు, మూడురోజుల్లో యూరియా దిగుమతి అవుతుంది. అనూహ్యంగా వరి విస్తీర్ణం పెరగడంతో యూరియాకు కొంత డిమాండ్ ఏర్పడింది. సబ్ డివిజన్‌లో ఎడగారులో 7 వేల ఎకరాలు నాట్లు పడేవి. ఇప్పుడు 12 వేలకు పైబడి నాట్లు పడ్డాయి.

– కె.శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

ప్రసన్నకు పరామర్శల వెల్లువ



పడుగుపాడు దళిత మహిళలతో ప్రసన్న

కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై పచ్చమూకలు దాడి చేసి పైశాచికానందాన్ని పొందాయి. ఈ దారుణాన్ని తట్టుకోలేని కోవూరు నియోజకవర్గ ప్రజలు ఆయన్ను పరామర్శించేందుకు వస్తున్నారు. దాడి తీవ్రతను ప్రత్యక్షంగా గమనించి కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియంతృత్వ పోకడను ఖండిస్తున్నారు. రామతీర్థం, పోతిరెడ్డిపాళెం, ఆంజనేయపురం, పడుగుపాడు తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు గురువారం పెద్ద ఎత్తున సుజాతమ్మ కాలనీలోని ప్రసన్న ఇంటికి గురువారం వచ్చి ఆయనను కలిశారు. ప్రశాంతిరెడ్డి వ్యవహారంపై దుమ్మెత్తిపోశారు. బుచ్చంగారి లలితమ్మ, భదేవమ్మ, నిర్మలమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

⇨ మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వింజమూరు వెంకటేశ్వర్లు నెల్లూరులో గురువారం పరామర్శించారు. ప్రసన్న నివాసంపై దాడిని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ బుచ్చి అధ్యక్షుడు షాహుల్, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ప్రసన్నను చూసి కన్నీటిపర్యంతమైన లలితమ్మ



ప్రసన్నతో పోతిరెడ్డిపాళెం మహిళలు



ఆంజనేయపురం మహిళలతో మాట్లాడుతున్న ప్రసన్న

దాడుల సంస్కృతి మాయని మచ్చ



మాట్లాడుతన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విడవలూరు: జిల్లా రాజకీయ చరిత్రలో దాడుల సంస్కృతి ఎప్పుడూ లేదని, మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి మాయని మచ్చగా మిగిలిపోతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి అన్నారు. స్థానిక పాత నెప్రూహా నికేతన్ స్కూల్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో విమర్శలకు ప్రతి విమర్శలు సహజమేనని, దానికి కొందరు గంజాయి బ్యాచ్‌ను వెంట బెట్టుకుని నల్లపరెడ్డి కుటుంబంపై దాడి అత్యంత హేయమైన చర్య అని, దీనిని కూడా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమర్థించుకునే ప్రయత్నం తగదన్నారు. ఈ దాడులను మరచిపోవాలని రోజుకో మండలం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ, నిరసన కార్యక్రమాలు ఎన్ని చేసినా ఆ మహిళే ఎమ్మెల్యేకు తగిన బుద్ధి చెబుతారన్నారు. పార్టీ కోవూరు ఎస్సీ సెల్ కన్వీనర్ అనపల్లి ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 7న ప్రసన్న ఇంటిపై దాడి చేస్తే ఇంతవరకు కేసు నమోదు చేయకపోగా, ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు అంటూ తిరిగి ప్రసన్నపై కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లుబాటు అవుతుందన్నారు. దాడి వల్ల ప్రసన్నకు వస్తున్న సానుభూతిని చూసి కోవూరు ఎమ్మెల్యే ఓర్వలేకున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి పార్టీ మారిన వారు ప్రసన్నను విమర్శించే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కొండూరు శ్రీనివాసులు, దాసరి కరుణాకర్ మాట్లాడుతూ ప్రసన్నతోపాటు ఆయన కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డిని చంపేందుకే టీడీపీ గూండాలతో దాడి చేశారని, ఇది పక్కా ప్లాన్‌తో అమలు చేశారన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి కార్యకర్తలు వేల సంఖ్యలో ఆయన ఇంటికి వెళ్తున్నారని, ఇంతటి బాధలో కూడా వచ్చిన వారికి భోజనం పెట్టి పంపిస్తుండడంతో ప్రసన్న మంచితనానికి నిదర్శనమన్నారు.

కామధేను ప్రాజెక్ట్ అభివృద్ధిపై దృష్టి



మాట్లాడుతున్న ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయకుమార్

కోవూరు: జిల్లాలోని చింతలదేవిలో ఉన్న కామధేను ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న పశు గణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో సర్వసభ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కామధేను ప్రాజెక్టులో 500కు పైగా ఆవులు, 300కు పైగా గొర్రెలు ఉన్నాయన్నారు. ప్రధానంగా మేలు జాతి పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మేలుజాతి పెయ్యదూడల ఉత్పత్తికి సార్టెడ్ సెమన్‌ను రూ.156లకే అందించేలా చొరవ తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో ఉన్న ల్యాబ్‌లో కూడా పిండ మార్పిడి ఉత్పత్తి ప్రయోగాలు చేస్తున్నారన్నారు. అనంతరం డీఏల్‌డీఏ చీఫ్ ఈఓ, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడి కార్యాలయ ప్రహరీకి రూ.10 లక్షలు, అదేవిధంగా కార్యాలయం నుంచి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలతో అంచనాలు వేశామన్నారు. కార్యక్రమంలో విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, చింతలదేవి కామధేను ప్రాజెక్టు ఇన్‌చార్జి జేడీ సూర్యనారాయణ, నాబార్డు డీడీఎం డాక్టర్ బాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్



మాట్లాడుతున్న ముఖేష్

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీ గోవిందరెడ్డిపాళెం, పొట్టెంపాడు ఎస్సీకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ గురువారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తుంటే తమకు సమాచారం అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు గీతాదేవి, కౌసల్య పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** స్థానిక శుశృత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం విద్యార్థినులకు బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ ముఖేష్ మాట్లాడుతూ బాలికలకు ఆపద వస్తే 112, లేదా 100 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. వేధింపులకు గురి చేసే వారిపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 37వ ర్యాంక్

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో 2024–25 వార్షిక సంవత్సరానికి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో 37వ ర్యాంక్ సాధించిందని కమిషనర్ నందన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన ద్వారా వివరాలను గురువారం తెలియజేశారు. గతేడాది జాతీయ స్థాయిలో 130వ ర్యాంక్‌లో ఉన్న నెల్లూరు నగరం, ఈ ఏడాది అసాధారణ పురోగతిని నమోదు చేయడం గర్వకారణంగా నిలిచిందని తెలిపారు.

స్విమ్మింగ్ కోచ్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): చిన్నారి మృతి కేసులో స్విమ్మింగ్ కోచ్‌ను దర్గామిట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని సప్తగిరి లేఅవుట్‌లో వంశీకృష్ణ– ఆదిలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమార్తె మనస్వి(9), కుమారుడు సంతానం. కుమార్తెకు ఈత నేర్పించేందుకు ఈ ఏడాది మార్చి 26వ తేదీన తల్లిదండ్రులు సి.సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫీజు చెల్లించారు. 27న కుమార్తెను తీసుకుని వారు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లారు. మీరు దగ్గరుంటే చిన్నారి స్విమ్మింగ్ నేర్చుకోలేదని సిబ్బంది తల్లిదండ్రులను అక్కడి నుంచి పంపివేశారు. ఏమైందో తెలియదు కానీ స్విమ్మింగ్ చేస్తుండగా చిన్నారి మృతిచెందింది. అప్పట్లో కోచ్‌తో పాటు అక్కడున్న వారి నిర్లక్ష్యంతో కుమార్తె మృతిచెందినట్లు బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రోశయ్య విచారణ చేపట్టారు. గురువారం స్విమ్మింగ్ కోచ్ నాగరాజును అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

లాడ్జిల్లో తనిఖీలు



బ్యాగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నగర పోలీసు అధికారులు పలు లాడ్జిలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి గదిని పరిశీలించి అక్కడ బస చేసిన వారిని ఎన్ని రోజుల నుంచి ఉన్నారు? ఎక్కడి నుంచి.. ఏ పనిమీద వచ్చారు? అనే వివరాలతోపాటు వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి లగేజీలను తనిఖీ చేశారు. లాడ్జిలో దిగిన వ్యక్తుల ఆధార్‌కార్డుతోపాటు వారి పూర్తి వివరాలతో రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని, ఆ వివరాలను ప్రతిరోజూ స్థానిక పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. నగర పోలీసు అధికారులు చిట్టెం కోటేశ్వరరావు, కె.వేణుగోపాల్‌రెడ్డి, జి.దశరథరామారావు, కె.రోశయ్య, కె.శ్రీనివాసరావు, జి.సాంబశివరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కసుమూరు చెరువుకట్టపై ట్రాన్స్‌ఫార్మర్

వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామంలోని మస్తాన్‌వలీ దర్గా సమీపంలో చెరువుకట్టపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. తక్కువ ఎత్తులో దిమ్మె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం, శుక్రవారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో భక్తులు తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రదేశంలోకి ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నాలుగు ఆలయాల్లో చోరీలు



మొగళ్లూరు ఎస్సీ కాలనీ మాతమ్మ ఆలయం



హుండీని పగులగొట్టిన దొంగలు

• హుండీలోని నగదు, అమ్మవారి తాళిబొట్లు అపహరణ

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరులో నాలుగు ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీలు జరిగాయి. గ్రామస్తుల కథనం మేరకు.. రోడ్డు పక్కనే ఉన్న మాతమ్మ ఆలయం తాళాలు పగులగొట్టి ఏడు తాళిబొట్లు, ముక్కుపుడక, హుండీని అపహరించారు. ఎస్సీ కాలనీకి సమీపంలో ఉన్న రామాలయంలోకి ప్రవేశించి హుండీలోని నగదును కాజేశారు. జెడ్పీ హైస్కూల్ వద్దనున్న అభయాంజనేయస్వామి హుండీని పగులగొట్టి అందులో నగదును ఎత్తుకెళ్లారు. భద్రకాళమ్మ ఆలయంలోకి ప్రవేశించి తాళిబొట్లు, ముక్కుపుడక, ఇతర పూజా సామగ్రిని చోరీ చేశారు. మాతమ్మ ఆలయంలోని హుండీని అపహరించి చిల్లర నాణేలను పడేసి నోట్లను తీసుకున్నారు. హుండీని చెరువులో పడేసి వెళ్లారు. వరుస చోరీలతో గ్రామస్తులు భీతిల్లారు. గ్రామంలో రైతులు, కూలీ పనులకు వెళ్లేవారు తెల్లవారుజాము నుంచే తిరుగుతుంటారు. అయితే ఏ సమయంలో ఆగంతకులు వరుస చోరీలకు పాల్పడ్డారో తెలిసిరాలేదు. బాగా తెలిసిన వారి పనిగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దేవాలయాలను పరిశీలించి ప్రాథమిక వివరాలు సేకరించారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



దేవళాలమిట్ట సమీపంలో మలుపు

తోటపల్లిగూడూరు: వరిగొండ మార్గంలో ఉన్న రెండు మలుపులు ప్రమాదకరంగా మారాయి. వరిగొండ పంచాయతీలోని దేవళాలమిట్ట సమీపంలో మండల కేంద్రం తోటపల్లిగూడూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో ఈ రెండు మలుపులు పక్కపక్కనే ఉన్నాయి. ప్రయాణం సాగించే సమయంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించవు. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద చిన్నపాటి స్పీడ్ బ్రేకర్లున్నా అవి వాహనాల వేగాన్ని నియంత్రించలేకున్నాయి. అంతేకాక ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేవు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న తమకు చాలీచాలని జీతాలతో బతుకుతున్నామని.. మా పొట్ట కొట్టొదని కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఎస్‌ఎంసీలో పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ పిలిచిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న ఇంజినీరింగ్ కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల కడుపులు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపే టెండర్లను తక్షణమే రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం జిల్లా నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడారు. ఇంజినీరింగ్ విభాగం కార్మికులు అతి తక్కువ జీతం పొందుతున్నారని, ఫలితంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ రూరల్ కార్యదర్శి కె.పెంచల నరసయ్య, నాయకులు అజీజ్, సుధాకర్, చిరంజీవి, యూనియన్ నాయకులు మట్టిపాటి శ్రీనివాసులు, సుజాతమ్మ, లోకేష్, అశోక్, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.